క్లుప్తంగా

జ్వాలాముఖి అమ్మవారికి కుంకుమార్చన



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రం అమరావతి అమరేశ్వరస్వామి దేవస్థానంలోని జ్వాలాముఖి అమ్మవారికి శుక్రవారం లక్ష కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి అర్చకులు పంచామృత రుద్రాభిషేకం జరిపారు. అనంతరం శంకరమంచి చంద్రశేఖరశర్మ దంపతుల ఆధ్వర్యంలో జ్వాలాముఖి అమ్మవారికి అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో గోపినాథశర్మ, భక్తులు పాల్గొన్నారు.

బాబూరావు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



అమరావతి: ఇటీవల మండల పరిధిలోని మల్లాది ఎస్సీ కాలనీకి చెందిన వ్యవసాయ కూలీ గొర్రెపాటి బాబూరావు అనారోగ్యంతో చనిపోయాడు. ఈ క్రమంలో మరో ఇరవై రోజుల వ్యవధిలోనే అతని భార్య మేరీ కూడా మరణించింది. ఆ కుటుంబానికి శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పంపిన ఆర్థిక సాయాన్ని మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పిచ్చయ్య, భవిరిశెట్టి సాంబశివరావు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ



అచ్చంపేట: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పడమర వైపు సుమారు 30మీటర్ల పొడవు గల ప్రహరీ కూలిపోయింది. ఈ మేరకు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్. కల్యాణి శుక్రవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కార్యాలయానికి సమాచారం అందజేశారు. గోడ పడిపోవడం వల్ల పశువులు, ఇతర జంతువులు ఆవరణలోకి ప్రవేశించే అవకాశం ఉందని, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశాలు కూడా లేకపోలేదని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయంలో పంటలు పండించడం వల్ల ఆరోగ్యకర ఉత్పత్తుల్ని పొందవచ్చని జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ సూచించారు. మండలంలోని రెడ్డిగూడెం, గణపవరం, బలిజేపల్లి గ్రామాల్లో ప్రకృతి సాగులో ఉన్న పొలాల్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలలో ఖాళీగా ఉన్న 2,3 సెంట్ల భూమిలో సూర్య మండలం మోడల్ విధానంలో ఆకుకూరలు, పండ్లు, దుంపజాతి, తీగజాతి కూరగాయల్ని ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులు వస్తాయని వివరించారు. నెలకు రూ. 3వేల దాకా ఆదాయం కూడా పొందవచ్చని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా బలిజేపల్లిలో కొలికొండ రాములు పండిస్తున్న పలు రకాల పండ్లు, ఆకు కూరల పంటల్ని పరిశీలించారు. కార్యక్రమంలో క్రోసూరు డివిజన ఇన్‌చార్జి సంధ్య, యూనిట్ ఇన్‌చార్జిలు శ్రీనివాసరెడ్డి, రమణయ్య, కె.జ్యోతి, ఐసీఆర్‌పీలు సునీత, పాపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యమైన నారుతో వరిలో అధిక దిగుబడులు



క్రోసూరు: వరి సాగులో నారు ప్రాత ప్రధానమని, ఆరోగ్యవంతమైన నారుతో అధిక దిగుబడి పొందవచ్చని ఏవో వేణుగోపాల్ తెలిపారు. నారు పెంపకంలో జాగ్రత్తల్ని శుక్రవారం ఆయన రైతులకు తెలియజేశారు. నారుమడిని 10,12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ము చేసి, నీరు పెట్టడానికి ,తీయడానికి కాలువలు ఏర్పాటు చేయాలని తెలిపారు ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌లను దుక్కిలో వేయాలని సూచించారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు ఐదు కిలోల చొప్పున జల్లుకోవాలని తెలిపారు. నారు ఒక ఆకు పూర్తిగా విచ్చుకొనే వరకు ఆరుతడులు ఇవ్వాలని, తరువాత పలుచగా నీరు నిలకట్టాలని సూచించారు. జింకు లోపాన్ని గమనిస్తే లీటరు నీటికి రెండు గ్రాము జింకు సల్ఫేట్ పిచికారీ చేయాలలన్నారు. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికల్ని సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలని చెప్పారు. నారు తీయడానికి ఏడు రోజుల ముందు సెంటుకు 160 గ్రాముల చొప్పున కార్బోఫ్యూరాన్ గుళికల్ని తక్కువ నీటిలో వేయాలని తెలిపారు.

ఓటర్ల జాబితాపై సర్వే చకచకా..

- ఆగస్ట్ 21 వరకూ పున:పరిశీలన
- అక్టోబర్ 17న ముసాయిదా జాబితా విడుదల
- 2024 జనవరి 5న తుది ఓటర్ జాబితా
- నియోజకవర్గంలో 2,32,415 మంది ఓటర్లు



రెంటపాళ్లలో సర్వే చేపడుతున్న బీఎల్‌ఓ

సత్తెనపల్లి: టీడీపీ హయాంలో అడ్డగోలుగా తయారుచేసిన ఓటర్ల జాబితాపై రాష్ట్ర ప్రభుత్వం పున:పరిశీలన చేపట్టింది. నకిలీ ఓటర్లను ఏరివేసి పారదర్శకమైన జాబితా మాత్రమే అందుబాటులో ఉంచేందుకు కసరత్తులు చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ఒకే ఇంటి నంబర్‌పై పదుల సంఖ్యలో ఓట్లు, జీరో డోర్ నంబర్‌తో సృష్టించిన ఓట్లు, డోర్ నంబర్లు లేనివి .. ఇలా అన్ని అంశాలపై పక్కాగా చేపట్టే సర్వే ప్రక్రియ ఈ నెల ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అట్టహాసంగా ప్రారంభ మైంది. గత ప్రభుత్వ హయాంలో ఓటర్ల జాబితాల్లోకి ఇష్టారాజ్యంగా బయట వ్యక్తుల పేర్లు చేర్చారంటూ అప్పట్లోనే చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే.

ఒకే ఇంటి నెంబర్‌పై వందలాది ఓట్లు నమోదు చేయడం, మరికొన్ని ఓట్లకు డోర్ నంబర్లే లేకపోవడం లాంటి అప్పటి అవకతవకలు ప్రస్తుత సర్వేలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు

సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో మొత్తం 2,32,415 మంది ఓటర్లున్నారు. వారిలో 1,14,027 మంది పురుషులు, 1,18,371 మంది మహిళలు, 17 మంది థర్డ్ జండర్ ఓటర్లున్నారు. తాజాగా చేపట్టిన సర్వేలో బీఎల్‌ఓలు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటున్నారు. మండలాల్లో తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు.

సత్తెనపల్లి నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు

మండలం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
సత్తెనపల్లి టౌన్	45	22,398	23,811	04	46,213
సత్తెనపల్లి రూరల్	75	29,041	30,365	05	59,411
ముప్పాళ్ల	44	16,936	17,675	01	34,612
రాజుపాలెం	47	20,082	20,883	04	40,969
నకరికల్లు	63	25,570	25,637	03	51,210
మొత్తం	274	1,14,027	1,18,371	17	2,32,415

ఇంటింటికీ బీఎల్‌ఓలు..

బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి మార్పులు, చేర్పుల్ని గుర్తించి తప్పులు ఉంటే సెల్‌ఫోన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల ఒకటిన ప్రారంభమైన సర్వే ఆగస్ట్ 21 వరకూ కొనసాగుతుంది. ఆగస్ట్ 22 నుంచి సెప్టెంబరు 29 వరకూ పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెడతారు. అక్టోబర్ 17 నుంచి నవంబరు 30 వరకూ ఓటర్ల చేర్పులు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారు. డిసెంబర్ 26లోపు చేర్పులు, మార్పులు, తొలగింపులు, ఇతర క్లెయిమ్‌లు పరిష్కరిస్తారు. 2024 జనవరి ఒకటిన జాబితాల తుది పరిశీలన నిర్వహిస్తారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి డోర్ నంబరులో ఎన్ని ఓట్లున్నాయి, వారు ఎక్కడెక్కడ నివాసముంటున్నారు అనే విషయాలు స్పష్టంగా తెలుసుకునేందుకు బీఎల్వోలతో యాప్ ద్వారా ఇంటింటి సర్వే చేస్తున్నాం. ప్రతి ఇంటికీ బీఎల్వోలు వెళుతున్నారు. ఆగస్టు 21 వరకూ బీఎల్వోలు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు సర్వే చేస్తారు. వారం వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నాం. ఎక్కడా ఎలాంటి పొరబాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందిస్తాం.

–ఎస్.సురేష్, తహసీల్దార్, సత్తెనపల్లి

భక్తిశ్రద్ధలతో పీర్ల ఊరేగింపు



ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్లలో శుక్రవారం తెల్లవారుజామున మొహర్రం వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీర్ల ఊరేగింపు వేడుకగా జరిగింది. పండుగకు ముందు రోజు ముస్లిం వీరుల త్యాగాలకు గుర్తుగా వారిని స్మరిస్తూ చావిడిలలో పీర్లను ఉంచుతారు. అందంగా ముస్తాబు చేసి గ్రామంలో ఊరేగిస్తారు. ముస్లిం యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ

దొడ్లేరు(క్రోసూరు): మత సామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని దొడ్లేరులో రెండు చావిడ్లలో ఏర్పాటు చేసిన పీర్లను ఆయన సందర్శించి, బాసికలు అందజేశారు. ముజావర్లతో కలసి ప్రత్యేక నమాజులు చేశారు. అనంతరం పీర్ల ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు సయ్యద్ అబ్దుల్ రహీం, సయ్యద్ సైదా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష

నకరికల్లు: మండలంలోని కుంకలగుంటలో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి అర్జీలు అందజేసి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

జగనన్న సురక్ష ... జనానికి రక్ష

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేద ప్రజలకు అవసరమైన సేవలు ఉచితంగా దక్కుతున్నాయని, ఇది పేద ప్రజానీకానికి రక్ష అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలో గ్రామంలో జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాన్యుడి సమస్య పరిష్కారానికి అండగా నిలిచిన ×జగనన్న సురక్ష । కార్యక్రమం అద్భుతమైన ఫలితాలు సాధించిందని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభించిందన్నారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఏ పార్టీ, ఏ ప్రభుత్వం చేయని రీతిలో యంత్రాంగమే నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి పత్రాల్ని అందించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.ధూళిపాళ్లలో 1,861 గృహాలు ఉండగా, సచివాలయ యంత్రంగం 1,366 గృహాలు సర్వే చేసిందన్నారు. ఇందులో ప్రజల నుంచి 392 అర్జీలు, అభ్యర్థనలు రాగా 366 మందికి ధ్రువీకరణ పత్రాలతో పాటు సమస్యల పరిష్కారం చేశారని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ కుంభా లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు వీరమ్మ, ధూళిపాళ్లలో సొసైటీ చైర్మన్ నలబోతు శివన్నారాయణ, నాయకులు రాయపాటి కామేశ్వరరావు, మర్రి సుబ్బారెడ్డి, చిలక జైపాల్, ఎంపీడీవో జి.వి. సత్యనారాయణ, తహసీల్దార్ ఎస్. సురేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

సామాన్యుల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

అమరావతి: సామాన్యుల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్టు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. మండలంలో దిడుగు సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాన్యుల సమస్యల పరిష్కారానికి అండగా నిలిచిన జగనన్న సురక్ష కార్యక్రమం అద్భుతమైన ఫలితాలు సాధించిందని తెలిపారు. రాజకీయ చరిత్రలో ఏ పార్టీ, ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో అధికార యంత్రాంగమే నేరుగా ప్రతి గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కరించిందని పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదో ప్రత్యేక అధ్యాయమన్నారు. అమరావతి మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 5017 సమస్యల్ని గుర్తించి, పరిష్కరించడం అభినందనీయమని తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ నాయుడు రాంబాబు, గ్రామ సర్పంచ్ వింతా శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు భవిరిశెట్టి హనుమంతరావు, తేళ్ల రోశయ్య, ఎంపీడీవో మాధురి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ధూళిపాళ్లలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు



దిడుగులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

పేద ప్రజలకు అండగా జగనన్న పాలన

నకరికల్లు: పేద ప్రజలకు అండగా జగనన్న పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని కుంకలగుంటలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష నిర్వహించిన ప్రతి గ్రామంలోనూ వచ్చిన అర్జీల్ని సత్వరమే పరిష్కరించి, ప్రజల సమస్యల్ని అప్పటికప్పుడే పరిష్కరించినట్లు తెలిపారు. 11రకాల కార్యక్రమాలకు ఎలాంటి రుసుం లేకుండా ఉచిత సేవల్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రాయితీపై విత్తనాల్ని రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఈఓపీఆర్డీ గిరిధర్, పలుశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి, అధికారులు

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

క్రోసూరు: మండలంలోని బయ్యవరం గ్రామ జనసేన నాయకులు, సర్పంచ్ చెన్నవరపు కాశమ్మ దంపతులుతో పాటు వారి అనుచరులు పలువురు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో శుక్రవారం చేరారు. క్రోసూరులోని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు వేసి ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, ఎంపీపీ పి.కోటయ్య, పట్టిల శ్రీనివాసరావు, బయ్యవరం వైఎస్సార్ సీపీ నేత కొతారు వెంకట్రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే శంకరరావు పరామర్శ

అచ్చంపేట: మండలంలోని చెరుకుంపాలెం నుంచి గురువారం రాత్రి బైకుపై వస్తున్న ముగ్గురిని ఎదురుగా వస్తున్న మినీ లారీ, స్థానిక దోసపాటి చెరువు వద్ద ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్ర గాయాలతో కొన ఊపిరితో ఉన్న మరియకుమారి(35)108లో గుంటూరు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆమె కూడా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందింది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శుక్రవారం గ్రంథశిరి, చెరుకుంపాలెం గ్రామాలకు వెళ్లి భౌతికకాయాల్ని సందర్శించి, వారికుటుంబ సభ్యులు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

అమరావతి–బెల్లంకొండ రోడ్డు పనుల పరిశీలన

అమరావతి: పెదకూరపాడు నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న అమరావతి–బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు నిర్మాణాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మల్లాది గ్రామం వద్ద పరిశీలించారు. పనుల్ని మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కల్వర్టులు, వంతెనలు, రోడ్డు పనుల నాణ్యతలో రాజీ పడొద్దని చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు భవిరిశెట్టి హనుమంతరావు ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

క్రోసూరు: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి బాబూరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాల్ని గుడ్‌షెపర్డ్ స్వచ్ఛంద సంస్థ సుపరీయర్ సిస్టర్ విన్నరసి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల, క్రోసూరు, అనంతవరం, 88త్యాళ్లూరు, దొడ్లేరు, పెరికపాడు, పీసపాడు, అందుకూరు, బాలెమర్రు గ్రామాల్లో శుక్రవారం విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశాల్ని నిర్వహించారు. కార్యక్రమానికి సంస్థ ప్రతినిధి బాబూరావు అధ్యక్షత వహించారు. మండలంలోని ఊటుకూరు ,విప్పర్ల సచివాలయాల్లో జరిగిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజావలి, ప్రకాశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలు మన దేశ సంపదని, వారి రక్షణ అందరి బాధ్యతని తెలిపారు. బాలలందరూ బడికి వెళ్లేలా చూడాలని తల్లిదండ్రుల్ని కోరారు. బాల్య వివాహాల్ని అరికట్టాలని సూచించారు. ఆరోగ్యం, విద్య అభివృద్ధికి సూచికలని పేర్కొన్నారు. గ్రామాల్లో విలేజ్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు తమ పరిధిలో బాలల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను, బాలల అక్రమ రవాణాను అరికట్టాలని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయ పోలీసులు, అంగన్‌వాడీలు, గుడ్‌షెపర్డ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న విలేజ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు

దమ్మాలపాడులో ఫ్యామిలీ డాక్టర్ సేవలు

దమ్మాలపాడు(ముప్పాళ్ల): మండలంలోని దమ్మాలపాడులో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి 166 మందికి సేవలందించారు. 57మందికి సాధారణ, 45మందికి బీపీ, 54మందికి షుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు వ్యాక్సిన్లు అందించారు. అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్లి వైద్యసేవలతో పాటు మందుల్ని అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ రహిమూన్, ఎంపీహెచ్‌ఏ కరీముల్లా, డీఈఓ రవితేజ, ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

మండలంలోని చౌటపాపాయపాలెం పునరావాస కేంద్రంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల్ని అందించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణకుమార్ 84 మందికి వైద్య పరీక్షలు చేసి, మందుల్ని పంపిణీ చేశారు. ముగ్గురు బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందుల్ని అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి ఇళ్లకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ గ్లోరీ, సీహెచ్‌వో హన్నకుమారి, ఏఎన్‌ఎంలు ప్రమీలాబాయి, కోటి లింగమ్మ, ఆశా కార్యకర్తలు ఈశ్వరమ్మ, దిబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



చౌటపాపాయపాలెంలో పరీక్షలు నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్

జగనన్న సురక్షలో 3,424 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

అచ్చంపేట: మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఈనెల 2 నుంచి 27వరకు జరిగిన జగనన్న సురక్ష శిబిరాలలో మొత్తం 3,424మందికి సంక్షేమ పథకాల అర్హతకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.రెండు టీములుగా ఏర్పడి 17 సచివాలయాలు, 23 పంచాయితీలు, 28 గ్రామాలకు చెందిన వారికి ధ్రువీకరణ పత్రాల్ని వలంటీర్ల ద్వారా జల్లెడపట్టి మరి పంపిణీ చేశామన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులని గుర్తించినట్లయితే ఆగస్టు 15నుంచి సంక్షేమ పథకాల్ని మంజూరు చేస్తామని తెలిపారు. ధ్రువపత్రాల్లో ఆదాయం 1263, కుల నిర్ధారణ 1278, వివిధ కారణాలవల్ల పథకాలు ఆగిపోయినవారు తిరిగి పొందేందుకు 48 పత్రాలు, 163మందికి ఆధార్ లింకులు, రేషన్ కార్డులో కొత్తగా పేర్లు చేరికలు 253మంది ఉన్నారని వివరించారు. ఆధార్ అప్‌డేట్ ఆరు, కౌలు రైతు వ్యవసాయ అర్హత పత్రాలు 231మందికి, నూతన రేషన్ కార్డులు 27మందికి, రేషన్‌కార్డుల విభజన 24మందికి, రేషన్ కార్డులో పేర్లు తొలగింపు ఏడుగురికి, పెళ్లి ధ్రువీకరణ పత్రాలు ఇద్దరికి ఇచ్చామని తెలిపారు. అడంగల్ 1–బి పత్రాలు 27మందికి, భూ విభజనలు ఐదు, ఎన్‌కంబ్రెన్స్ పత్రాలు రెండు, ఆరోగ్యశ్రీ అప్‌డేట్ ఏడు, ఆర్థికంగా వెనుకబడినవారి సర్టిఫికెట్స్ నాలుగు, నూతన ఆరోగ్యశ్రీ కార్డులు తొమ్మిది, మరణపత్రాలు ఇద్దరికి, కుటుంబ సభ్యుల పత్రాలు 13తో కలిపి మొత్తం 3424మందికి ఎలాంటి రుసుము లేకుండా సచివాలయాల ద్వారా ఉచితంగా సురక్ష శిబిరాల్లో పంపిణీ చేశామని ఎంపీడీవో వివరించారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం



సత్తెనపల్లి: తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గుడిగండ్ల గ్రామ సమీపంలోని 167 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ షకూర్, షేక్ బాషా మృతదేహాల్ని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. పట్టణంలోని వారిరువురి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బంధువుల్ని ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం, పార్టీ అండగా ఉంటుందని ఆయా కుటుంబాలకు భరోసా కల్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, కోఆప్షన్ మెంబర్ సహారా మౌలాలి, నాయకులు అచ్యుత శివప్రసాద్, జానీబాషా, ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

సత్తెనపల్లి: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని ఎల్ఐసీ మేనేజర్ జె.వి.ఎస్.ఎన్ సురేష్‌బాబు అన్నారు. పట్టణంలోని నాగార్జున నగర్‌లో గల శ్రీ చైతన్య పాఠశాలలో హరిత భారత్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు మొక్కల్ని పంపిణీ చేశారు. మొక్కల పెంపకం, వాటి ప్రయోజనాల్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం డాక్టర్ అంజయ్య, ఆర్వో సురేంద్ర, ఎల్ఐసీ ఏటీబీసీ బాలాజీ నాయక్, వసంత బాబు, ఎల్ఐసీ అడ్వైజర్ కోనంకి మారుతి, వి. రాము, పాఠశాల ప్రిన్సిపాల్ కె.కె.విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎల్ఐసీ మేనేజర్ సురేష్‌బాబు

మణిపూర్ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలి

బెల్లంకొండ: మణిపూర్‌లో మహిళలపై దాడులకు తెగబడ్డ వారిపై నిర్భయ చట్టం కంటే కఠిన చట్టాల్ని అమలు చేసి శిక్షించాలని గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు దుగ్గి కీర్తన డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలతో కలసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కీర్తన మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఆడవాళ్లపై అత్యంత దారుణంగా మతతత్వ శక్తులు దాడులు చేయడం సిగ్గుచేటని ఖండించారు. వారిపై ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడం భారతదేశంలో మహిళల భద్రతను ప్రశ్నిస్తోందని తెలిపారు. దీన్ని ప్రజాస్వామ్యవాదులంతా తీవ్రంగా ఖండించాలని కోరారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.కార్యక్రమంలో మహిళామండలి సభ్యులు రాధమ్మ, సువార్త, సుశీల, పద్మజ, శైలజ, పాస్టర్ శామ్యూల్ పాల్గొన్నారు.



బెల్లంకొండలో గ్రేస్ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళల ర్యాలీ